# పరివర్తన

ఎ. రాజరాజేశ్వరి

చేటలో బియ్యం పోసి శుభ్రం చేస్తున్న సావిత్రిని చూస్తుంటే, లావణ్యకి చిరాకు కలిగింది.
“ఛీ... ఈవిడకెన్ని సార్లు చెప్పినా జ్ఞానముండదు. ఏ అత్తయినా పని చేయమంటే ఏడుస్తుంది. ఈవిడని తిని కూర్చోమంటే ఏడుస్తుంది. తగుదునమ్మా! అంటూ అన్ని పనుల్లో తల దూరుస్తుంది”
అర్భకంగా, నల్లగా ఉన్న చేతులు బియ్యంలో కదులుతుంటే ఇక భరించలేక పోయింది.



“మీకెన్ని సార్లు చెప్పాను. నన్నడకుండా ఏ పనీ... కల్పించుకోవద్దని. కృష్ణా... రామా.. అంటూ ఓ మూల కూర్చోలేరా...!”

ఆ గదమాయింపుకి ఉలిక్కి పడ్డ సావిత్రి మొహంలో బాధ రెపరెపలాడింది.

“ఏదో నీకు కొంచెం సాయం చేసినట్లుంటుంద నీ...”అంటూ నీళ్లునమిలింది.

“మీ బోడి సాయం నాకేం అవసరం లేదు. కష్టపడి పోతున్నట్లుగా... మీ అబ్బాయి ముందు బిల్డప్‌లివ్వద్దు”


సావిత్రి మొహం వివర్ణమయింది. పెడసరంగా అంటున్న కోడలి మాటలకు మనసు రోధిస్తుంటే, లేచి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

లావణ్యది పేరుకు తగ్గట్టుగా అందమయిన రూపం. పసిమి ఛాయ, చక్కటి అంగ సౌష్టవంతో చూడగానే ఎదుటివారు చక్కటి అందం అని మెచ్చుకుంటారు.

పెళ్లికి ముందు ఆమె చాలా కలలు కంది తన అందానికి రాజకుమారుడు కాకపోయినా, బాగా డబ్బున్న వారో, ఏ ఆఫీసరో తనని అమాంతం మోహించి వరిస్తారని ఆశ పడింది.

దీపం చుట్టూ తిరిగే శలభాల్లా, మగ పిల్లలు ఆమె చుట్టూ తిరిగారే కానీ, వారిలో ఎవరికీ పెళ్లి ఆలోచన లేదు. దానికి కారణం– ఆమె తండ్రి చిరుద్యోగి. ముగ్గురు ఆడపిల్లలు, భార్యే కాకుండా అతడి తల్లి, తండ్రి కూడా వీరితోనే ఉండడంతో చాలీ చాలని జీతం డబ్బులతో, ఇరుకు గదుల్లో బతుకు బండి లాక్కురావడంతో, దీపకళిక లాంటి అందాన్ని ఇష్టపడ్డారే కానీ, దీపాన్ని ముద్దెట్టుకోవాలంటే, మూతి కాలుతుందని తెలిసి, ఆమెను ఎవరూ పెళ్లి చేసుకోవాలనుకోలేదు.

# కథ



లావణ్య ఇంటర్‌తో చదువాపేయడం, లైబ్రరీలోని నవలలు తెచ్చుకుని, రంగుల కలలు కనేది.

అయితే- పెళ్లి చూపులకు కూర్చున్న ప్రతీసారీ... పెళ్లికొడుకు అర్హత చూసి, ఆమె ఆశలు వెలవెల బోయేవి.

తండ్రి అసహాయ స్థితి లావణ్యకు బాగా అర్థమయింది. తమ దరిద్రానికి మంచి సంబంధం రాదు. ఒక వేళ వచ్చినా వారు కోరే కట్నమిచ్చుకుని తండ్రి తన పెళ్లి చేయలేడు. తన వెనకింకా ఇద్దరు ఆడపిల్లలు మరి.

అతి త్వరలోనే వాస్తవాన్ని గ్రహించి. తన కోరికలు, ఆశలు కలలకే పరిమితం చేసుకుని తండ్రి తెచ్చే వాడిని చేసుకుందుకు సిద్ధపడింది.

అటువంటి సమయంలో- ఆమె ఆశలకు కొత్త ఊపిరి పోస్తూ పెళ్ళిళ్ళ పేరయ్య ఒక సంబంధం తెచ్చాడు. పెళ్లికొడుకు పేరు చక్రవర్తి. బ్యాంకులో ఉద్యోగం, బాదర బందీలు లేవు. అతడికి తోడుగా తల్లి మాత్రం ఉంది. వారికి పిల్ల బాగుంటే చాలు. కట్నం పట్టింపులు లేవు.

ఆ వార్తకి ఇంటిల్లిపాదీ సంతోషంతో పొంగిపోయారు. పెళ్లి వారి రాకకై నిరీక్షించసాగారు.

లావణ్య అతడి పేరు విని నవ్వుకుంది. తన కోరికలు ఆశలు తెలిసిన భగవంతుడు చక్రవర్తిని తన భర్తగా చేస్తాడేమో!నని.

''తన తండ్రికొచ్చే పదివేల జీతంలో ఏడుగురు బతుకుతుంటే, అతడికొచ్చే ఇరవయి వేల జీతంతో ముగ్గురు మనుషులు ఏ ఒడిదొడుకులూ లేకుండా దర్జాగా బతకొచ్చును. ఆ ముసలావిడ కూడా గుటుక్కుమందంటే ఇక తామిద్దరిమే... కలలో కూడా తీర్చుకోలేని ఖరీదయిన కోరికలు తీరడానికి ఎంతో సమయం పట్టదు'' ఊహల ఊయలలో ఊగసాగింది. తన కలలకు మెరుగులు దిద్దుకుంటూ.

చక్రవర్తి అందగాడు కాకపోయినా అనాకారి కాదు. ఛామన ఛాయగా ఒడ్డూ, పొడుగూ ఉండి, ఉద్యోగం ఇచ్చిన సెక్యూరిటీ వలన మొహంలో ఒక విధమయిన ఆత్మ విశ్వాసం, వెలుగూ జ్యోతికమవుతున్నాయి.

అయినా తన అందం ముందు దిగదుడుపే! అతడి తల్లిని చూసాక, తన ఆశల సౌధం పేక మేడలా కుప్పకూలినట్టు గిజగిజలాడింది.

ఆవిడ నల్లగా సన్నగా ఉండడమే కాక, మశూచి వచ్చింది కాబోలు! మొహం అంతా స్ఫోటకం మచ్చలు. దానికి తోడుగా పళ్లెత్తుగా ఉండి బయటికి పొడుచుకొచ్చాయి. ఆమె ఏ మాత్రం నోరిప్పినా... దంత సౌందర్యం ప్రస్ఫుటమవుతోంది.

లావణ్య ఆశలు, కోరికలు ఆవిడను చూడగానే ఆవిరయిపోయాయి. ''రేపు పుట్టబోయే పిల్లలకు నానమ్మ అందం వస్తే...? ఇక జీవితాంతం ఏడవాలి''



తనంత అందగత్తె! దిష్టిబొమ్మలా ఉండే ఆ అనాకారితో ఒకే ఇంట్లో కలిసుండడం ఊహించుకోలేక పోయింది.

పెళ్లివారికి లావణ్య నచ్చడంతో, ఆమె ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే, తండ్రి ముహూర్తాలు పెట్టించేయడంతో, లోలోనే సున్నం ఉడికినట్టుగా ఉడికిపోయింది.

తెగించి తండ్రికి తన మనసులో మాట చెప్పేసింది. ''ఆ అనాకారిని అత్తగారిగా భరించడం నా వల్లకాదు. ఆవిడని వృద్ధాశ్రమంలో చేర్పిస్తానంటేనే ఈ పెళ్లికి అంగీకరిస్తా''నని

ఆమె మాటలు పూర్తి కాకుండానే, తండ్రి కొట్టినంత పని చేసాడు.

''అబ్బాయి బుద్ధిమంతుడు, మంచి ఉద్యోగస్థుడు. ఆవిడెలా ఉంటే నీకెందుకు? అందం శాశ్వతమనుకుంటున్నావా? ఆవిడ ఎంతో మర్యాదస్తురాలు. పెద్ద మనసుతో కట్నం లేకుండా పెళ్లికంగీకరించింది. ఈ సంబంధం కాదన్నావంటే, జన్మలో నీకు పెళ్లి చేయను. నీ చావేదో నువ్వు చావు''తండ్రి కోపానికి లావణ్య నోరు మూత పడింది.

అయిష్టంగానే కోడలిగా ఆ ఇంట కాలు పెట్టింది.

అత్తగారి మెతకతనం, భర్త మంచితనం అతి త్వరితంగానే ఆకళింపు చేసుకుంది. ఇక తను ఆడింది ఆట పాడింది పాట అనుకుంది సంతోషంగా.

సావిత్రి చాలా సౌమ్యంగా, మంచిగా ఉండి ఎవరినీ పల్లెత్తు మాటనదు. సంసారం పొదుపుగా చేయడమే కాక, వంట అద్భుతంగా చేస్తుంది. కొడుకు రావడం ఎంత లేటయినా సరే! అతడు వచ్చాకనే.. అతడితో కలసి తింటుంది. మొదటి నుంచీ అదే అలవాటు ఆమెకు.

పెళ్లయినా కూడా, అమ్మా... అంటూ తల్లి వెనకాలే తిరగడం, అతడికిష్టమయిన పదార్థం తల్లి కంచంలో నుంచి యధేచ్ఛగా తీసుకుని తినడం, ఆఫీసు నుంచి వచ్చాక ఆవిడ బాగోగులు విచారించి, తల్లి ఒడిలో కాసేపు తల పెట్టుకుని పసిపాపలా విశ్రమించడం. ఇవన్నీ... లావణ్యకు మింగుడు పడడం లేదు. ఆమెకు తల్లీ, కొడుకులు అంత సఖ్యతగా ఉండడం కంపరంగా ఉంటోంది.

తనలాంటి అందగత్తె భార్యగా లభించాక కూడా తన చుట్టూ తిరగక, ఆ అనాకారి తల్లిని అంటిపెట్టుకుని ఉండడంతో, సావిత్రి పట్ల కసి, ద్వేషం ఉవ్వెత్తున లేచాయి. సాధ్యమయినంత తొందరలో ఆవిడకి ఇంటి నుంచి ఉద్వాసన చెప్పకపోతే తను సుఖపడలేదు.

చక్రవర్తి మంచి మూడ్‌లో ఉన్నపుడు, అతడి దగ్గర తన మనసులోని మాట చూచాయగా తెలిపింది. ఆమెను ఆ స్థితిలో అలాగే వదిలిపెట్టి వెళ్లిపోయాడు. అక్కడ నుంచి వారం రోజులు ఆమెతో మాట్లాడడం మానేసాడు.

లావణ్య అసహనంతో ఉడికి పోయింది. ''దీనికంతటికీ కారణం– ఆ అనాకారి. ఆవిడ మాయ మాటలు, చాడీలు విని తనని నిర్లక్ష్యం చేస్తున్నాడు''

భర్త ఇంట్లో లేనపుడు సావిత్రి మీద మాటల దాడి మొదలుపెట్టింది. తనకీ, భర్తకీ మధ్య అడ్డుగా ఉండి ఏకాంతం లేకుండా చేస్తోందనీ, వంట విషయం, ఇంటి ఖర్చులు అన్నీ తనే చూసుకుంటానని, ఆవిడ అనాకారితనం తను భరించలేక పోతోందని, తనన్న మాటలు కొడుకుతో చెప్పినా, వ్యతిరేకించినా నేనెంతకైనా తెగిస్తాను. కిరసనాయిలుతో అంటించుకుని, మీ ఇద్దరినీ ఇరికించి జైలులో పెట్టిస్తా, జాగ్రత్త! అని హెచ్చరించడంతో సావిత్రి చిగురుటాకులా వణికిపోయింది. అందమయిన కోడలు దొరికిందని మురిసిపోయిందే కానీ, ఆ అందం వెనక ఇంతటి అనాకారి మనసుందని తెలుసుకుని విలవిలలాడింది.

సావిత్రి లోపలికెళ్లి, కొడుకు ఇంటి ఖర్చులకని తనకిచ్చిన డబ్బంతా తెచ్చి, లావణ్య చేతుల్లో పోసింది.

కొడుకు వచ్చే టైముకి ఇంట్లో ఉండక, గుడికెళ్లిపోయింది.

చక్రవర్తికి రోజూ న్యూస్ చూసాక, డిన్నర్ చేయడం అలవాటు కానీ, ఆ రోజు కొడుకు రాకుండానే అన్నం తినేసి, వెళ్లి పడుకుంది.

తల్లి భోజనం అయిందని తెలిసి, చక్రవర్తి ఆశ్చర్యంగా అడిగాడు లావణ్యను ''ఏమయింది? అమ్మ ఆరోగ్యం బాగుందా? అన్నాడు ఆత్రంగా.

''ఏమీ కాలేదు. బాగానే ఉన్నారు. మనిద్దరం కలసి తినాలని ఆవిడ ముందే తినేసారు'' అంది మనసులో కొంచెం బెరుకుగా.

అతడు తేలిక పడ్డ మనసుతో భోజనం చేసి, తల్లి గదిలోకి వచ్చాడు.

''అమ్మా... వంట నీ వంటలా లేక తినబుద్ధి కాలేదు. ఇంత త్వరగా పడుకున్నావు. ఒంట్లో బాగా లేదా...!''ఆర్తిగా అడుగుతున్న కొడుకుని చూసి ఆమె గుండె దుఃఖంతో బరువెక్కింది.

''కోడలొచ్చాక కూడా ఎన్నాళ్లు చేస్తానురా... ఇక అన్ని బాధ్యతలు కోడలికిచ్చేసి, నేను విశ్రాంతి తీసుకుంటాను'' అంది కన్నీళ్లను ఆపుకుంటూ.

సావిత్రి తన మీద చాడీలు ఏమీ చెప్పకపోవడంతో లావణ్య కళ్లు ఆనందంతో మెరిసాయి.

అంతవరకూ, ప్రతినెలా చక్రవర్తి ఇచ్చిన డబ్బులో ఇంటి ఖర్చులు పోను, ఎంతో కొంత మిగిలేది.

డబ్బు పెత్తనం లావణ్య చేతిలోకి వచ్చాక, పదిరోజులు తిరిగే సరికి డబ్బులయిపోయాయి. ''ఖర్చులకు డబ్బు కావాలి'' ఇవ్వమంటున్న ఆమెని చూసి తెల్లబోయాడు.

''ఇచ్చాను కదా...! మళ్లీ డబ్బేమిటి?''అన్నాడు. అతడలా నిల దీస్తాడనుకోకపోవడంతో, నోటికొచ్చిన అదనపు ఖర్చులు చెప్పేసింది.

అసలు సంగతి– ఇన్‌స్టాలుమెంటులో చీరలు కొనే

## యువతలో అనుష్క డిమాండ్

కొన్నాళ్ళ క్రితం ఆంధ్రప్రదేశ్ కుర్రకారు ఇంటర్ నెట్ నుండి ఏ తార ఫోటోలు ఎక్కువ డౌన్ లోడ్ చేసుకుంటున్నారన్న విషయంపై సర్వే లాంటిది జరిగింది. అందులో సోనాలి బెంద్రే ఫోటోల ప్రముఖంగా తేలింది. ఇటీవల మళ్ళా నిర్వహించిన సర్వేలో ఈ గౌరవం అనుష్కకు దక్కింది. ఖచ్చితమైన లెక్కలు తేలలేదు గానీ, యువతరంలో అధిక శాతం తమ హాస్టల్ రూమ్ గోడల్ని అనుష్క ఫోటోలతోనే అలంకరిస్తున్నారట. ఉస్మానియా, ఆంధ్రా యూనివర్శిటీ హాస్టల్స్‌లో దాదాపు ఏ గదిలోకి వెళ్ళినా ఈమె ఫోటోలే దర్శనమిస్తాయట. నటన సంగతి పక్కన పెడితే, ఆమె తేనె రంగు చర్మం, సొగసైన శరీర సౌష్టవం, కవ్వించే కళ్ళు ఆమెను యువతకు హాట్ ఫేవరెట్‌గా మార్చేసాయని భావిస్తున్నారు.

సింది. పక్కింటావిడతో మ్యాట్నీలకు చెక్కేసింది. కూల్‌డ్రింకులు, టిఫిన్లు, ఐసుక్రీములు.. లాంటి తీరని కోరికలన్నీ తీర్చుకుంది.

చక్రవర్తి ఇంట్లో ఉన్నంత సేపూ, మౌనంగా ఉండి, అతడు ఆఫీసుకి వెళ్లగానే, ఏదో ఒక వంకతో సావిత్రి మీద విరుచుకు పడుతోంది. తన మాటల్లో, చేతల్లో అంతులేని ద్వేషాన్ని కోపాన్ని ప్రదర్శిస్తూ బుసలుకొడుతోంది.

అంత టార్చర్ అనుభవిస్తున్నా, కొడుక్కి తెలిస్తే ఎటువంటి గొడవలొస్తాయో! అతడెక్కడ బాధపడతాడోనని అవమానాలన్నీ తనలోనే దిగమింగుకోవడం అలవాటు చేసుకుంది సావిత్రి.

లావణ్య నెల తప్పింది. తొమ్మిదో నెల లోపుగానే కొడుకు నెత్తుకుని తిరిగొచ్చేసింది. ఇక్కడ లభించే స్వేచ్ఛ, సుఖాలు అక్కడ దొరకవుగా!

మనవడి మీద ఆమె నీడ కూడా పడనివ్వకపోవడంతో, నానమ్మని అన్న ఆనందం ఆవిరయిపోయింది సావిత్రికి. లావణ్య చూసే కోర చూపులు, బెదిరింపు మాటలు వాడిని ఎత్తుకోవాలి, ఆడించాలి అన్న కోరికలను చంపేసింది.

అమృతం లాంటి తల్లి ప్రేమ, మనసూ అతడికి బాగా తెలుసు. కానీ, తల్లి ఎందుకిలా విముఖత ప్రదర్శిస్తోంది? చక్రవర్తికి అర్థం కాక లోలోపలే మథన పడసాగాడు.

ఆ రోజు గుడిలో పురాణ కాలక్షేపం ఉంటే, కాస్త త్వరగా బయలుదేరి వెళ్లింది సావిత్రి. ఏ ఉద్దేశ్యంతో లావణ్య తనని పనులు చేయనివ్వక దూరం పెడుతున్నా, ఆధ్యాత్మికంగా భగవంతుడి సేవకి దగ్గరవుతోంది సావిత్రి. కావలసినంత తీరిక కాబట్టి, గుడికెళ్లింది. చక్రవర్తి బాబుని ఆడించడానికి దగ్గరలో వున్న పార్కుకెళ్లాడు.

లావణ్య వంట పనిలో పడింది.''వంట త్వరగా ముగించి బాబుకి పెట్టేస్తే తినేసి త్వరగా పడుకుంటాడు. లేకుంటే... నానమ్మా... అంటూ ఆ అనాకారి దగ్గరకు చేరతాడు. తనెంత తిట్టినా, అవమానించినా, పిసరంత కూడా చలించక తమ చూరు పట్టుకునే వేళాడుతోంది. ఈ పీడ ఎప్పటికొదులుతుందో!''అత్తగారిని తిట్టుకుంటూ పోపుల డబ్బా తీయడానికి అటు తిరిగింది.

ఆమె కట్టుకున్న నైలాను చీర స్టవ్ మీద పడి, క్షణాల్లో మంటలు పైకి ఎగబాకాయి.

ఏం జరిగిందో గ్రహించే లోపుగానే చర్మం అంటుకుపోతుంటే, బాధ భరించలేక కేకలు పెడుతూ బయటకు పరుగెత్తింది.

అగ్నికి, వాయువు జత కలవడంతో మొహం, వీపు, చేతులు కాళ్లు కూడా మంట వేడికి తొక్కలూడి బొబ్బలెక్కాయి.

మండిపోతున్న లావణ్యని చూసి, పక్కింటావిడ మందంగా ఉన్న రగ్గు కప్పేయడంతో మంటలారాయి. కానీ, లావణ్య అప్పటికే స్పృహ కోల్పోయింది. కబురు తెలిసి, ఇంటికి తిరిగొచ్చిన సావిత్రి, చక్రవర్తి ఆమె నా స్థితిలో చూసి తల్లడిల్లిపోయారు.

లావణ్యకి ప్రాణ గండం అయితే తప్పింది. కానీ, బాగా కాలిన చోట స్కిన్ గ్రాఫ్టింగ్ చేసినా, మిగిలిన చోట్ల గాయాలు, మచ్చలు అలాగే ఉన్నాయి.

అటువంటి పరిస్థితిలో కూడా సావిత్రి వంట చేయడానికి, బాబుని చూసుకుందుకు ఇష్టపడక పోవడంతో చక్రవర్తి తల్లిని నిలదీసాడు.

''ఏం జరిగింది? నీలో ఎందుకింత మార్పు! ఇప్పటికయినా చెప్పకపోతే, నామీద ఒట్టు''అన్నాడు. ఆమె చేతిని తన తల మీద పెట్టుకుంటూ.

సావిత్రింకా దాచలేక పోయింది. కోడలికి తన రూపం పట్ల వున్న అయిష్టతతో ఏపనీ చేయనివ్వక, బాబుని కూడా ముట్టుకోనివ్వకపోవడం అన్నీ చెప్పింది.

చక్రవర్తి మ్రాన్పడి పోయాడు. ఇన్ని రోజులూ వారిద్దరి మధ్యా గొడవలు లేవనుకున్నాడే కానీ, తన భార్యింత మూర్ఖురాలని తెలుసుకోలేక పోయాడు.

తల్లి పడిన వేదన తలచుకొని, చాలా దుఃఖించాడు ''ఇలా..రా..అమ్మా...''అంటూ ఆమెను లావణ్య పడుకున్న గదిలోకి తీసుకెళ్లాడు.

''నిన్ను అనాకారి అంటూ ఈసడించి, ద్వేషించిన దీని అందం చూడు. ఎంత బాగుందో!'' అని సావిత్రి వారిస్తున్నా, వినక అద్దం తెచ్చి లావణ్య ముందుంచాడు.

కాలిపోయాక మొదటిసారి అద్దం చూసుకున్న లావణ్య కెవ్వుమంది. ఆమె జుట్టు, కనుబొలకులు కూడా కాలిపోయి మొహమంతా ఎర్రగా మచ్చలు.

ఏడుస్తున్న లావణ్యను చూసి ''దేముడు నీకు తగిన శాస్తి చేసాడు అనుభవించు''అని చక్రవర్తి కోపంగా వెళ్లిపోయాడు. సావిత్రి ఓదార్పుగా లావణ్యని దగ్గరకు తీసుకుంది.

''నా అందాన్ని కాక నాలో మాత్ర హృదయాన్ని చూసాడు కాబట్టి, వాడి దృష్టిలో నేను అందగత్తెనే. మనసు నిర్మలంగా, స్వచ్ఛంగా ఉంచుకుంటే అది శాశ్వత అందంగా ఎప్పటికీ నిలిచి ఉంటుంది.అందాన్ని శరీరానికి మాత్రమే పరిమితం చేసుకుంటే, జరగరానిది జరిగినపుడు పర్యవసానం ఇలాగే ఉంటుంది. నువ్వు ఏ స్థితిలో ఉన్నా నా కోడలివి. మనసులో ఎలాంటి భయాలు పెట్టుకోక పిల్లాడి కోసమన్నా త్వరగా కోలుకోవాలి''

క్షమించమన్నట్టుగా తన వైపు జాలి చూపులు చూస్తున్న లావణ్యని భయం లేదన్నట్టుగా భుజం తట్టి, ఆ క్షణం నుంచీ కంటికి రెప్పలా చూడసాగింది.

కాళ్లు పుళ్లుపడిపోయి, మంచం మీదే తన మల, మూత్రాలను ఎత్తిపోస్తున్న అత్తగారిని చూస్తుంటే లావణ్య హృదయం పశ్చాత్తాపంతో, అపరాధ భవనతో దహించుకుపోసాగింది. ఒకప్పుడు ఎవరి నయితే అనాకారని ఈసడించి, అవహేళన చేసిందో! ఆమే తన కళ్లకిపుడు శాంతి దూతలా, దేవతలా కనిపిస్తోంది.

హృదయ సౌందర్యానికి మించిన అందం లేదు అన్న విషయం ఆలస్యంగా అర్థమయింది ఆమెకి.

సావిత్రి చేతి వంటని అమృతంలా ఆస్వాదిస్తోంది.బాబు వచ్చి నానమ్మా... అంటూ ఆమెను చుట్టుకుపోయినా ఆనందిస్తోంది.

సావిత్రి సపర్యలతో లావణ్య అనూహ్యంగా కోలుకుంది. ఆమె తన పనులు తను చేసుకోవడం మొదలుపెట్టాక సావిత్రి అడిగింది.

''వంటింక నువ్వే చేస్తావా!''అంటూ

''వద్దత్తయ్యా! మీ అతి మంచితనంతో నన్ను బాధించకండి. దేవతలాంటి మిమ్మల్ని చాలా బాధపెట్టాను. దేముడు నాకు తగిన శాస్తి చేసి నా కళ్లు తెరిపించాడు. అందం శాశ్వతమని విర్రవీగాను. మిమ్మల్ని ఎంత హింస పెట్టినా, నా తప్పులు క్షమించారు''

''నాలో ఉన్న ద్వేషం, కుళ్లు, కపటం పూర్తిగా అగ్నిలో ఆహుతయ్యాయి. నేను ప్రారంభించే కొత్త జీవితం మీ అండలో సంతోషంగా ఉండాలని దీవించండి''అని సావిత్రి కాళ్లకి నమస్కరించింది.

లావణ్యలోని పరివర్తనకు సావిత్రి పట్టరాని ఆనందంతో ఆమెని లేవనెత్తి ప్రేమగా కౌగిలించుకుంది.

అప్పుడే లోపలికొచ్చిన చక్రవర్తి ఆ స్థితిలో ఉన్న వారిద్దరినీ నమ్మలేనట్టుగా, ఆశ్చర్యంగా చూసాడు.

లావణ్యలో పరివర్తన తెచ్చిన మార్పు వలన ఆమె మొహంలో ఒక విధమయిన వెలుగుని, సంతోషాన్ని నింపింది. భార్యా రూపవతీ శత్రుః అన్న విషయం ఆమె విషయంలో నిజమయినా, ఆమెను గుణవతిగా మార్చడానికే ఈ అనర్థం జరిగింది కాబోలు!

ఇప్పుడామె అనాకారితనం అతడిని బాధించలేదు నేను కూడా నీకు అండగా ఉన్నానన్నట్లుగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

*

## మళ్ళీ ప్రేమలో...



తమిళ నటుడు శింబుతో నయన తార ప్రేమాయణం, ఇద్దరి గాఢ చుంబనం పత్రికలకు లీకవ్వడం, తరువాత గొడవలొచ్చి ఇద్దరూ విడిపోవడం అందరికీ తెలిసిందే. శింబుతో విడిపోయిన తర్వాత నయన తార చాలా త్వరితంగా తారా పథంలోకి దూసుకుపోయింది. తెలుగులోను, తమిళంలోనూ ప్రముఖ హీరోలతో నటించి భారీ హిట్లు సంపాదించుకుంది. అంతేగాక, ఇటీవల అజిత్‌తో 'బిల్లా'లో ఆమె నటించిన బికినీ సీన్ ఆ సినిమాకే పెద్ద ఆకర్షణగా నిలిచింది. తన మాజీ ప్రియురాలు ఈ రీతిలో దూసుకుపోతుండటంతో శింబుకు మళ్ళీ ఆమెపై ప్రేమ మళ్ళుతున్నట్టుంది. ఇటీవల ఆమెకు తరచూ ఎస్.ఎం.ఎస్‌లు పంపటం, ఏ చిన్న సందర్భానికైనా పూలు పంపడం లాంటివి చేస్తున్నాడట. అంతేకాదు, ఇంతయినా నయన తార కూడా మళ్ళీ శింబు పట్ల ఆదరాన్ని చూపిస్తుందట. ఈ వ్యవహారం చూసి, తెలిసి తెలిసీ నయనతార మళ్ళీ నిప్పుల్లో అడుగు పెడుతోందంటున్నారంతా.